క్లుప్తంగా

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం

భైంసాటౌన్: ముధోల్ అసెంబ్లీ పరిధిలోని కుభీర్, తానూరు, బాసర, లోకేశ్వరం మండలాలకు బీజేపీ అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కుభీర్ మండలాధ్యక్షుడిగా అయేషాల దత్తాత్రి, తానూరు మండలాధ్యక్షుడిగా యాతాలం చిన్నారెడ్డి, బాసర మండలాధ్యక్షుడిగా కిశోర్ దేశాయ్, లోకేశ్వరం మండలాధ్యక్షుడిగా లక్కంపల్లి జయసాగర్‌ను నియమించినట్లు తెలిపారు.

ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌టౌన్: సీపీఎస్ రద్దు, ఆదాయ పన్ను పరిమితి పెంచాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట భోజన విరామం సమయంలో టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఇందులో నాన్ గెజిటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిధుల పెంపు హర్షణీయం

ఖానాపూర్: బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతి వేడుకలకు ప్రభుత్వం ఇచ్చే నిధులను రూ.రెండు కోట్లకు పెంచడం హర్షణీయమని లంబాడా జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు భుక్యా గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో రూ.కోటి ఇచ్చేవారన్నారు. నిధులు పెంచినందుకు సీఎంకు లంబాడా జేఏసీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అశోక్, రమేశ్‌నాయక్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎస్సైకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న సభ్యులు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, సారంగపూర్, ఎలగడప గ్రామాల సమీపంలో అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ఖానాపూర్ సీఐ మోహన్‌కు, కడెం ఎస్సై రాజు, తహసీల్దార్ సుజాతకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండాడి జగ్గారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజారమేశ్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమ్మె

నిర్మల్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు శుక్రవారం ఒకరోజు సమ్మె చేపట్టారు. బీఎస్ఎన్ఎల్ సంస్థ నష్టాల్లో ఉందని.. ప్రైవేట్ సంస్థలకు 4జీ, 5జీ అనుమతులు ఇవ్వడం సరికాదని ఉద్యోగులు పేర్కొన్నారు. 2017 జనవరి 1 నుంచి మూడో వేతన సవరణ అమలు చేయడంతోపాటు నూతన ప్రమోషన్ పాలసీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సెక్రెటరీ నరేందర్‌గౌడ్, బీఎస్ఎన్ఎల్ జిల్లా ప్రెసిడెంట్ శంకర్, ఉమ్మడి జిల్లా సెక్రటరీ శ్రీనివాసులు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకేరెడ్డి జన్మదిన వేడుకలు



సోన్: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సోన్: మండలంలోని గంజాల్ గ్రామంలో శుక్రవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోహినొద్దీన్, న్యాయవాది ముత్యం, స్వామి, ముత్తన్న, శ్రీధర్, రాహుల్, శేఖర్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము, జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి, ధర్మాజీ రాజేందర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు

సన్మానం

తానూరు: ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మోహన్‌సింగ్‌ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల నాయకులు సన్మానించారు. శ్రీనివాస్‌రెడ్డి, కమలాకర్, అబ్దుల్ గన్ని, జ్ఞానేశ్వర్, మాధవ్‌రావ్, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా సమ్మె

- పాల్గొన్న రైతులు, కార్మికులు
- పలు చోట్ల ర్యాలీలు, రాస్తారోకో



దేగాంలో రాస్తారోకో చేస్తున్న నాయకులు



ఖానాపూర్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు

భైంసాటౌన్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ, రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ఆరోపించారు. శుక్రవారం దేశవ్యాప్త కార్మికుల సమ్మె–గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా మండలంలోని దేగాంలో రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేసి.. ఢిల్లీలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, రామచందర్‌రెడ్డి, ప్రేంనాథ్‌రెడ్డి, లక్ష్మణ్, మహేందర్, గంగాధర్, రామకృష్ణ, శంకర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

భైంసాలో మానవహారం..

దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా పట్టణంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మురళీమోహన్, సీఐటీయూ నాయకులు విజయ, ఏఐటీయూసీ నాయకులు ముత్యం, దేవన్న, సోమేశ్ పాల్గొన్నారు.

కడెం: గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా కార్మికులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దుతోపాటు ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు.

లక్ష్మణచాంద: కార్మికులు సంఘటితంగా పోరాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో లక్ష్మణచాందలో నిరసన చేపట్టారు. తహసీల్దార్ జానకికి వినతిపత్రం అందజేశారు. ఏసు లక్ష్మి, సాయన్న, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: రైతు, కార్మిక, ప్రజల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అఖిలపక్ష, వామపక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని సత్తనపల్లి గ్రామంలోని పెంబి ఎక్స్‌రోడ్ వద్ద రైతుసంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య, మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆత్రం సుగుణ, అంకుష్‌రావు, నారాయణ, మంచికంటి లక్ష్మణ్, భూక్య రమేశ్, కుంచపు ఎల్లయ్య, ఇబ్రహీం, గోపినాయక్, సుదర్శన్, గుమ్ముల రమేశ్, గంగారెడ్డి, రాజన్న ఉన్నారు.

ఖానాపూర్: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు, ఆశవర్కర్లు ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి జగన్నాథ్‌రావు చౌరస్తా వరకు ర్యాలీ తీసి తెలంగాణతల్లి చౌక్‌లో రాస్తారోకో చేశారు. అంతకుముందు భవన నిర్మాణ కార్మిక సంఘం, హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాగెల్లి నర్సయ్య, కమల, త్రివేణి, గంగాధర్, సురేశ్, శేఖర్, నాగరాజు, జావిద్, రవి, చిన్ననర్సయ్య, రమేశ్ తదితరులు ఉన్నారు.

ముధోల్: దేశవ్యాప్త సమ్మెలో మండల కేంద్రంలో కార్మికులు నిరసన తెలిపారు. శంకర్, హైమద్, గౌతమ్, దిగంబర్, బుధర్, శివాజీ ఉన్నారు.

తానూరు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనాలు అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజన కార్మికులు భరత్‌బాయి, సరిత, ముత్తవ్వ, అనిత, లక్ష్మి, అనుశ్రీ పాల్గొన్నారు.

కుంటాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని కోరారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ తీశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి బాపట్ల లలిత, ఇంద్రమాల, ఫర్జనా, విమల, దేవకి, గుణసుందరి, మమత, విజయ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



కడెంలో రోడ్డుపై బైఠాయించిన కార్మికులు



లక్ష్మణచాందలో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు



తానూరులో సమ్మె చేస్తున్న ఆశవర్కర్లు



కుంటాలలో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

దిలావర్‌పూర్ ఎస్సైగా సుమాంజలి

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ మండల ఎస్సైగా పోగుల సుమాంజలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన యాసిర్ అరాఫత్ బదిలీపై దస్తురాబాద్ వెళ్లారు. నిర్మల్‌టౌన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సుమాంజలి ఇక్కడకు వచ్చారు. నూతన ఎస్సైకి సిబ్బంది, తదితరులు అభినందనలు తెలిపారు.

18న సినీనటుల ఎంపిక

నిర్మల్‌రూరల్: త్రిగుణ అనే తెలుగు చలనచిత్రంలో నటించేందుకు ఆసక్తి కలిగిన కళాకారుల కోసం ఈనెల 18న ఆదివారం నిర్మల్‌లో ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు దర్శకుడు కొప్పుల చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చలనచిత్రం మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయిందని.. రెండో షెడ్యూల్ షూటింగ్ కోసం నటీనటులను ఎంపిక చేసేందుకు జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆడిషన్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గొల్లపేట్ అంబేద్కర్ విగ్రహం పక్కన జీఆర్‌బీ అపార్ట్‌మెంట్ రూంనెంబర్ 101లో తెలంగాణ మూవీ అండ్ టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ భవనంలో ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆడిషన్స్ జరుగుతాయన్నారు. 20 నుంచి 50 ఏళ్లున్న కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 80084 82758, 99491 66819 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో రేణుకమాత ఎల్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 27వరకు జరుగనున్నాయి. మొదటిరోజు గ్రామంలోని పెద్ద గౌడ్ ఇంటి వద్ద గడప వన మహోత్సవం నిర్వహించారు. అనంతరం గౌడ సంఘ సభ్యుల ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ప్రతి గ్రామం తిరుగుతూ ఉత్సవాల నాటికి గడపవనం గ్రామానికి చేరుకుంటుంది. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు నారా గౌడ్ రాజేశ్వర్‌గౌడ్, అంజాగౌడ్, రాజాగౌడ్, వేణుగౌడ్, లింబాగౌడ్, రవీందర్‌గౌడ్, నర్సాగౌడ్, గంగాధర్‌గౌడ్, హనుమా గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రథసప్తమి వేడుకలు

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి, కిసాన్‌గల్లి, పులేనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రథసప్తమి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో సూర్యనమస్కారాలు చేయించారు. జనార్దన్, సంకుల ప్రముఖ్ గోపాల్‌కిషన్, పాఠశాల అధ్యక్షులు శ్రీధర్, సమితి కార్యదర్శి సూకల సురేశ్, పాఠశాల కార్యదర్శి బన్నెల్లి సుదర్శన్, సహకార్యదర్శి కాశీనాథ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పెద్దహనుమాన్ మందిరంలో రథసప్తమి వేడుకలు ప్రారంభించారు. సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. తాళసప్త ధ్వజారోహణ, కలశ స్థాపన, అఖండ తాళ సప్త పూజలను పండితులు పాల్దె నరహరిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీటీసీ చిన్నరామయ్య, రాంరెడ్డి, కొంద్ర రమేశ్, రాజారెడ్డి, రాములు, సాయికృష్ణ, గంగారాం, పోతన్న, గంగారాం, రాము, దేవేందర్, రవి పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్, రబీంద్ర పాఠశాలలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యభగవానుడి పూజల అనంతరం విద్యార్థులు చేత సూర్య నమస్కారాలు చేయించారు. ప్రిన్సిపాల్ సారథిరాజు, సాయినాథ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్, ఓలా, కుంటాల, అంబకంటి, అందాకూర్, లింబా(కె), లింబా(బి) గ్రామాల్లో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సూర్య నమస్కారాలు చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో సూర్యనమస్కారాలు చేయించారు. విద్యార్థులు నిత్యం సూర్య నమస్కారాలు చేస్తే ఆరోగ్యంగా ఉంటారని పలువురు పేర్కొన్నారు.



నర్సాపూర్(జి): పెద్దహనుమాన్ ఆలయంలో..



కుభీర్‌లో సూర్యనమస్కారం చేస్తున్న విద్యార్థులు

శ్రీహరిరావు జన్మదిన వేడుకలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం 50 మంది పదోతరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు, 400 మంది విద్యార్థులకు పండ్లు అందజేశారు. పొట్టపెల్లి(కే) గ్రామ ప్రాథమిక పాఠశాలలోని 35 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వొడ్నాల రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, అట్ల రవీందర్‌రెడ్డి, అట్ల రాంరెడ్డి, నాగేశ్, రవి, నరేశ్‌రెడ్డి, పోతారెడ్డి, ముత్యం, భూమన్న, శేఖర్‌రెడ్డి, నారాయణ, ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, రమేశ్, సాగర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో శ్రీహరిరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు అరుగుమీది నారాయణ, దయానంద్, ఇబ్రహీం, సికందర్, అబ్బు, భోజారెడ్డి పాల్గొన్నారు.



కేజీబీవీలో విద్యార్థినులతో నాయకులు

'కిట్ల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం'

ఖానాపూర్: ప్రభుత్వం సమకూర్చిన న్యూట్రిషన్ కిట్లను గర్భిణులకు అందించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శులు పీటర్, సురేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. గర్భిణుల వివరాలు సిబ్బంది వద్ద ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో ఓపెన్ కావడం లేదనే సాకుతో కిట్లను ఇవ్వడం లేదని ఆరోపించారు. కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. స్వరూప, సంధ్య తదితరులు ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

సోన్: ఎండలు పెరుగుతున్నందున నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో సురేశ్‌తో కలిసి సోన్‌లో ఉన్న నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఈవోను ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఏపీవో మంజులరెడ్డి, కృష్ణ, సంధ్య, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

తర్లపాడ్‌లో..

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో నర్సరీ పనులను శుక్రవారం ఎంపీడీవో సునీత పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రిజ్వానా, ఫీల్డ్ అసిస్టెంట్ రమాదేవి ఉన్నారు.



సోన్‌లో పరిశీలిస్తున్న అధికారి గోవింద్

జిన్నింగ్‌మిల్లులో అగ్ని ప్రమాదం

- రూ.ఐదు లక్షలు నష్టం

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల గ్రామ శివారులో ఉన్న భారత్ కాటన్ జిన్నింగ్ మిల్లులో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.ఐదు లక్షలు నష్టపోయినట్లు బాధిత యజమాని పేర్కొన్నారు. రోజంతా రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని ఒకే చోట చేర్చారు. సాయంత్రం యంత్రాల్లో పత్తిని నూర్పిడి చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన సిబ్బంది ఫైరింజన్‌కు సమాచారమిచ్చారు. నిర్మల్ ఫైర్‌స్టేషన్ అధికారి జైత్‌రాం, సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేసరికి 100 క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు యజమాని తెలిపాడు.



పత్తి కాలిపోవడంతో దెబ్బతిన్న పరికరాలు

కాంగ్రెస్‌లో చేరిక

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరకు చెందిన వైస్‌ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, మన్మద్ మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం వారికి భైంసాలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, భోజారాం పటేల్, సాయన్న ఉన్నారు.

ఇష్టంతో చదవాలి

కుంటాల: విద్యార్థులు ఇష్టంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు తోట లక్ష్మణ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యువ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్షిక పరీక్షలపై అవగాహన కల్పించారు. ఎస్సై హన్మాండ్లు, ఎంఈవో ముత్యం, ఏఎస్సై రాందాస్, గంగాధర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ముధోల్: మండలంలోని చించాల గ్రామంలో శుక్రవారం ఏరువాక కేంద్రం, ముధోల్ శాస్త్రవేత్తలు కార్తీక్, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు మొక్కజొన్న పంటలో చేపట్టే సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. దిగుబడి పెరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

పాఠశాలలో ఫుడ్‌ఫెస్టివల్

భైంసాటౌన్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని ఉపాధ్యాయులు అన్నారు. మండలంలోని చింతల్‌బోరి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు కృష్ణ, నరేందర్, రత్న, రుషిక పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు 58 మంది ఎంపిక

కడెం: చేపలు, రొయ్యల పచ్చడి తయారీ, మార్కెటింగ్ తదితర అంశాలపై ఈడీఐఐ సంస్థ ఇచ్చే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుజాత అన్నారు. శుక్రవారం కడెంలోని రైతువేదికలో ఎంటర్‌ప్రెన్యూనర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఈడీఐఐ) సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించి 58 మంది మహిళలను ఎంపిక చేశారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని ఈడీఐఐ మాస్టర్ ట్రైనర్ దేవేందర్‌నాయక్ పేర్కొన్నారు. ఇందులో ఎస్‌బీఐ మేనేజర్ అశోక్, ఏపీఎం రాజారాం, ఏపీవో జయదేవ్, ఏఎస్సై దేవు, సీసీ స్వామి తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. జర పట్టించుకోరా..?



తానూరు: మండలంలోని ఇలేగాం నుంచి ఉమ్రి(కే) వెళ్లే మార్గంలో వంతెన వద్ద భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళ పలువురు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. అధికారులు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

సంక్షిప్త వార్తలు

కడెం డీటీగా శంకర్

కడెం: కడెం నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా జాదవ్ శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ పని చేసిన డీటీ చిన్నయ్య ఏసీబీ దాడుల్లో పట్టుబడి అరెస్టయిన విషయం తెలిసిందే. డీటీని తహసీల్దార్ సుజాత, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

సోన్ తహసీల్దార్‌గా మల్లేశ్

సోన్: మండల తహసీల్దార్‌గా మల్లేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన శివరాజ్ బదిలీపై ఖానాపూర్ వెళ్లారు. నూతన తహసీల్దార్‌ను సిబ్బంది సన్మానించారు. డీటీ జ్యోతి, ఆర్ఐలు రఫీక్, అలీ మున్నీస, ప్రశాంత్, వంశీ, భీంసింగ్, నరేశ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు న్యాయం చేయాలి

సారంగపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో తమకు అన్యాయం జరుగుతుందని.. ప్రభుత్వం వెంటనే ఈ పథకం రద్దు చేసి తమకు న్యాయం చేయాలని శుక్రవారం నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారిపై సాయినగర్ వద్ద ఆటో డ్రైవర్లు, యజమానులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా సంఘం నాయకులు ఖాజాసైదొద్దీన్, నర్సయ్య, చిన్నయ్య, భోజన్న మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సయ్య, సలీం, నవీన్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్ తహసీల్దార్‌గా శివరాజ్

ఖానాపూర్: ఖానాపూర్ నూతన తహసీల్దార్‌గా శుక్రవారం శివరాజ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ పరిమళ్ భౌమిక్ నిర్మల్ కలెక్టరేట్‌లో సూపరింటెంటెండ్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పరిమళ్ భౌమిక్‌తోపాటు శివరాజ్‌లను కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువాలతో సన్మానించారు.

ముధోల్: మండలాభివృద్ధిన కృషి చేస్తానని నూతన తహసీల్దార్ విఠల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎడ్‌బిడ్‌తండా గ్రామస్తులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో జాదవ్ జయ్‌చందర్, పవార్ అర్జున్, బాబు, అంబర్‌సింగ్, జాదవ్ గాడేన్న, మాధవ్‌రావు తదితరులు ఉన్నారు.

నిజాయతీ చాటిన యువకులు

మామడ: మండల కేంద్రానికి చెందిన యువకులు తమకు దొరికిన పర్సు, పట్టాదారు పాసుపుస్తకాలతో కూడిన కవర్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. మండలంలోని కప్పన్‌పల్లి గ్రామానికి చెందిన చుంచు చిన్న బాపన్న శుక్రవారం మండల కేంద్రంలోని బ్యాంకుకు వచ్చి బైక్‌పై స్వగ్రామం వెళ్తూ మామడ సమీపంలో ఆధార్, రేషన్ కార్డు, రూ.2500, పట్టాదారు పాస్‌పుస్తకాలతో కూడిన కవర్ పొగొట్టుకున్నాడు. మామడకు చెందిన శివ, నితిన్, సాయిలకు సదరు కవర్ దొరుకగా పోలీసులకు అప్పగించారు. అందులో ఉన్న వివరాల ఆధారంగా చిన్నబాపన్నను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి అందించారు.



బాపన్నకు ఇస్తున్న యువకులు